వైభవంగా విమాన దిగ్దేవతా విశేష హోమాలు

యాగశాలలో దిగ్దేవతా విశేష హోమం నిర్వహిస్తున్న రామానుజ జీయర్ స్వామి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి21 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం విమాన దిగ్దేవతా విశేష హోమాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో ఘనంగా జరిగాయి. నిత్యారాధనల అనంతరం స్వామి వారిని దివ్యమనోహరంగా అలంకరించి తిరు వీధి సేవోత్సవం నిర్వహించారు. యాగశాలలో ప్రవేశింపజేసి హోమాదుల నిర్వహించి, పంచ వింశతి కలశ స్నపనం జరిపారు. మూలమంత్ర, మూర్తి మంత్ర హవనం, నిత్యపూర్ణాహుతి, నివేదన, నీరాజన మంత్ర పుష్పం, శాత్తుమరై, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, చతుస్థానార్చనలు, మూర్తిమంత్ర హోమాలు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలను సమర్పిస్తూ ధాన్యాధివాసం చేశారు. వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్ రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ హనుమంతరావు

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి బంగారు విమాన గోపురం, మహా కుంభాభిషేకం సంప్రోక్షణ మహోత్సవానికి వస్తున్న సందర్భంగా అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ బందోబస్తును పెద్దఎత్తున ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులు, శానిటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, సీఈఓ శోభారాణి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ నాగిరెడ్డి, ఏఓ జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

సైకిల్‌పై పోలీసుల పెట్రోలింగ్

మోత్కూరులో సైకిల్‌పై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు

మోత్కూరు, ఫిబ్రవరి 21: మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో పోలీసులు సైకిల్‌పై పెట్రోలింగ్ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని కూడళ్లలో శుక్రవారం పోలీసులు సైకిల్‌పై గస్తీని ఏర్పాటు చేశారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల అదుపులోకి తీసుకు వచ్చేందుకు పోలీస్ శాఖ ఆదేశాల మేరకు తామున్నామంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, పోలీసులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఆత్మకూరు(ఎం) : కప్రాయపల్లిలో పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి21: మండలంలోని కప్రాయపల్లిలో నెల రోజుల క్రితం కలెక్టర్ హనుమంతరావు రైతు భరోసా పథకాన్ని పరిశీలించేందుకు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పట్టపగలు వీధి లైట్లు వెలుగుతుండడంతో గమనించిన కలెక్టర్ వెంటనే పంచాయతీ కార్యదర్శిని పిలిచి ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో మరుసటి రోజు నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఆన్ ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేశారు. కానీ గ్రామంలో ప్రస్తుతం వీధి లైట్లు పట్టపగలు కూడా వెలుగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలు మూణ్నాళ్ల ముచ్చటగానే మారిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

సెంట్రింగ్ కాలమ్ బాక్స్ చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

నిందితుడిని చూపిస్తున్న ఎస్ఐ శ్రీశైలం, పోలీసులు

బొమ్మలరామారం, ఫిబ్రవరి21 నాగినేనిపల్లి గ్రామంలోని కొమ్ము నరేశ్‌కు చెందిన సెంట్రింగ్ కాలమ్స్ చోరీ చేసిన దొంగలను శుక్రవారం ఎస్ఐ శ్రీశైలం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆయన శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామానికి చెందని కొమ్ము నరేశ్‌కు చెందిన43 సెంట్రింగ్ కాలమ్ బాక్స్‌లు ఈ నెల 19న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఎస్ఐ శ్రీశైలం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక అనుమానాస్పద వ్యక్తి కనిపించాడు. అతడు పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా సెంట్రింగ్ బాక్స్‌లు అమ్ముకోవడానికి వెళ్తున్నట్లు తెలిపాడు. 43 కాలమ్ బాక్స్‌లు, ఒక డ్యూక్ బండి, ఒక బైక్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడానికి చాకచక్యంగా వ్యవరించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు రాజు, మహబూబ్, సందీప్‌ను ఎస్ఐ శ్రీశైలం అభినందించారు.

ఆత్మకూరు(ఎం)లో తెలుగు అక్షరాలను ప్రదర్శిస్తున్న బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు

మాతృభాషను మరువద్దు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి21 : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు పలకలపై తెలుగు అక్షరాలను రాసి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మహాత్మాగాంధీ, నేతాజీ సుభాశ్‌చంద్రబోస్ విగ్రహాల వద్ద మానవహారం నిర్వహించి మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పావనీ కోటేశ్వర్‌రావు, వైష్ణవి, విజయ, మోహన్‌రాజ్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ మినీ మీటింగ్ హాల్‌లో శుక్రవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి పరీక్షల కోసం జిల్లాలో 50 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 8,631 మంది విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఉదయం 8.30గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, సంబంధిత అధికారులు కేటాయించిన విధులను జాగ్రత్తతో నిర్వహించాలని చెప్పారు. ప్రశ్నపత్రాల తరలింపులో అత్యంత భద్రత తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీ బస్సులు నడుపాలని, నిరంతరం పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తాగునీటితో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయని చెప్పారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ పరీక్ష కేంద్రాల్లో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో 29 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సర విద్యార్థులు 6,208 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,350 మంది మొత్తం 12558 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణకు ఉదయం 8గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. సమావేశంలో భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏసీపీ రమేశ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా ట్రెజరీ అధికారి సంపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రాజలింగం, జిల్లా వైద్య అధికారి మనోహర్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

● మండల ప్రత్యేకాధికారి గోపాల్

ఆలేరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గోపాల్

ఆలేరురూరల్, ఫిబ్రవరి 21 : గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి గోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున నీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీల నిర్వహణ, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ అనూరాధ, ఆర్‌డబ్ల్యూఎస్ సుప్రియ, ఏపీఓ వెంకటకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : ఎంపీడీఓ

ఆత్మకూరు(ఎం) : మండలంలోని అన్ని గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగానే సంబంధిత గ్రామ, మండల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నచోట బోర్లను అద్దెకు తీసుకొని నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్లూఎస్ ఏఈ మెహర్‌సాయి, ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

సాగు జలాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

రాజాపేటలో మసీదు ముందు సాగు జలాలు అందించాలని నినాదాలు చేస్తున్న ముస్లింలు

రాజాపేట, ఫిబ్రవరి 21 : కాళేశ్వరం జలాలు త్వరగా రాజాపేట మండలానికి రావాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం 15 ప్యాకేజీ ద్వారా గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ మండల కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్, నాయకులు ఎండీ తాయబ్ అలీ, సలావుద్దీన్, గోరేమియా, జాహంగీర్, ఫయాజ్, ఉస్మాన్, అస్సు, తౌకిర్, కలీం, హైమద్, ఖాజా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు(ఎం) : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తాసీల్దార్ రవికుమార్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి21 : ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తాసీల్దార్ రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలో 46మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు కలిగి ఉన్నారని, ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తిచే సినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములునాయక్, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్ తదితరులున్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు

అడ్డగూడూరులో విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న బైరెడ్డి సందీప్‌రెడ్డి

అడ్డగూడూరు, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం యువ జన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి సందీప్‌రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. పదో తరగతి మొదటి ర్యాంకు సాధించిన వారికి రూ.2,500, ద్వితీయ ర్యాంకు సాధించిన వారికి రూ.1,500, తృతీయ ర్యాంకు సాధించిన వారికి రూ.1,000 ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్, నరేందర్, లక్ష్మణ్, వెంకటేశ్, జోసెఫ్, నాయకులు పరిగెల సత్యనారాయణ, తుప్పతి లక్ష్మీ నారాయణ, గండెల రవి, బైరెడ్డి జగదీశ్‌రెడ్డి, షేక్ సమీర్, సోహెల్ పాల్గొన్నారు.

పక్షుల దాహార్తి తీరుస్తూ...

తొట్లలో నీళ్లు పోస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

రాజాపేట, ఫిబ్రవరి 21 : వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. మనుషులతోపాటు పశుపక్షాదులు దాహంతో అల్లాడిపోయే పరిస్థితి ఉన్నది. ఇందుకోసం పక్షుల దాహార్తిని తీర్చే ఆలోచనతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సిబ్బంది నీటి తొట్లను ఏర్పాటు చేశారు. వాటిల్లో ప్రతి రోజూ నీరు పోస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

మండల వ్యవసాయాధికారిగా పూజ

బాధ్యతలు స్వీకరిస్తున్న పూజ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి21 : మండల నూతన వ్యవసాయశాఖ అధికారిగా బి.పూజ శుక్రవారం విధుల్లో చేరారు. వికారాబాద్ జిల్లా పరిగిలో విధులు చేపట్టిన పూజ బదిలీపై ఆత్మకూరు(ఎం) మండలానికి వచ్చారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన అపర్ణ భువనగిరికి వెళ్లారు.

ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని ఇంద్రియాలలో ఇటీవల మృతి చెందిన ఆశాపోగు నరసింహ కుటుంబానికి సామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో(సామ మధుసూదన్‌రెడ్డి, సామ మోహన్ రెడ్డి) శుక్రవారం రూ.5వేలు రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు శ్రీహరి, పెద్దిరెడ్డి యాదగిరి, బోయిని రాజు, పెద్దిరెడ్డి వినోద్, శనిగారం రమేశ్, భీమగోని దేవయ్య, పెద్ది రెడ్డి కిష్టయ్య, చెక్క కుమార్, ధీరావత్ సందీప్, గగులోతు నవీన్ ఉన్నారు.

23న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

బీబీనగర్/ఆలేరు టౌన్, ఫిబ్రవరి 21 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో 5వ నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ఈ నెల 23న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వలిగొండ, ఆలేరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు సబ్బు రూప, ఎం.వెంకటమ్మ, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల ప్రిన్సిపాల్ బి.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు గురుకుల పాఠశాలల సెంటర్స్ పడిన వాళ్లు (సెంటర్ కోడ్ – 252712, 252704) 5 నుంచి 9వ తరగతి వరకు పరీక్ష రాసే విద్యార్థులు వలిగొండకు వెళ్లకుండా బీబీనగర్ పట్టణ కేంద్రంలోని రైల్వే గేట్ ఆవరణలో ఉన్న టీడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎగ్జామ్ పాడ్, హాల్ టికెట్, ఆధార్ కార్డ్, పాస్ ఫొటో, బ్లూ లేదా బ్లాక్ కలర్ పెన్ తీసుకొని ఉదయం తొమ్మిది గంటలలోపు సెంటర్‌కు చేరుకోవాలని తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● డిప్యూటీ పోలీస్ కమిషనర్ మనోహర్

బీబీనగర్, ఫిబ్రవరి 21 : రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె.మనోహర్ అన్నారు. మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రత పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని అన్నారు. రోడ్డు నియమాలపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఎయిమ్స్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ ఎస్.రమేశ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

● కేసీఆర్ పాలనకు కాంగ్రెస్ పోటీనే కాదు : ర్యాకల

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 10 సంవత్సరాల కేసీఆర్ పాలన ..12 నెలల కాంగ్రెస్ ప్రజాపాలనపై ప్రజల ముందు చర్చ పెడదామా అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాజ్‌పూర్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక అప్లికేషన్ల పేరుతో సంవత్సరం గడిపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఏడాది దాటినా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, కొత్త ప్రాజెక్టులు కట్టింది లేదని, గ్రామాలు, పట్టణాలను అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం లేదని, దాంతో గ్రామాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా, రూ.2 లక్షల రైతు రుణమాఫీ ఎంతమందికి ఇచ్చారో చెప్పాలన్నారు.

వైభవంగా స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు

చంద్రప్రభ వాహన సేవలో స్వామివారు

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలోని యాగశాలలో చతుస్థానార్చన, హోమం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ లోని అహోబిల క్షేత్రం నుంచి నరసింహ స్వామి ధరించిన మూల చందనం పట్టువస్త్రాలను ఆలయ ప్రధానార్చకులు శ్రీమాన్ కిడాంబి మధుసూదన్ తీసుకొచ్చారు. స్వర్ణగిరి వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు, స్థానాచార్యులు శ్రవణాచార్యుల చేతుల మీదుగా స్వర్ణగిరి వేంకటేశ్వరుడికి సమర్పించారు. అదే విధంగా ఆలయంలోని ఇష్టి యాగశాలలో లక్ష్మీనారాయణ హవనాన్ని నిర్వహించారు. నిత్య పూర్ణాహుతితో హోమ ఫలాన్ని స్వామివారికి సమర్పించారు. అనంతరం తిరుమాడ వీధుల్లో పల్లకి సేవ నిర్వహించారు. స్వామివారు చంద్రప్రభ వాహన సేవలో ఆలయ తిరు మాడ వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ విహరించారు. కార్యక్రమాలలో శ్రీవిల్లిపుత్తూరు ఆండాల్ మనవాళ మహాముని మఠం పీఠాధిపతి శ్రీ శఠగోప రామానుజ జీయర్ స్వామి, ధర్మకర్త మానేపల్లి మురళి కృష్ణ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌లో ఉపాధ్యాయులు మందలించారని..
గుట్టకు వచ్చిన విద్యార్థులు

యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 21: స్కూల్‌లో ఉపాధ్యాయులు మందించారని, తమనే టార్గెట్ చేస్తున్నారని గుట్టుచప్పుడు కాకుండా యాదగిరిగుట్టకు చేరుకున్న నలుగురు విద్యార్థులు పోలీసులకు చిక్కారు. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట పరిధి పటేల్‌నగర్‌కు చెందిన ఆజ్మద్, హర్షవర్ధన్, తేజ్‌నాథ్‌రెడ్డి, నితేశ్ కుమార్ అనే మైనర్ విద్యార్థులు ఆ ప్రాంతంలోనే ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నారు. వీరందరూ మంచి స్నేహితులు. పాఠశాలలో ఉపాధ్యాయులు నిత్యం తమనే టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తల్లిదండ్రులకు తెలియకుండా బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో బస్సు ఎక్కి యాదగిరిగుట్టకు చేరుకున్నారు. రెండు రోజులు బస్టాండ్‌తోపాటు కొండకింద పుష్కరిణి ప్రాంతంలో నిద్రించారు. శుక్రవారం మండలంలోని దాతారుపల్లి గ్రామ శివారు ప్రాంతంలో నలుగురు విద్యార్థులు అనుమానాస్పందంగా సంచరిస్తుండగా పోలీసులు గమనించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీరిపై అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు పట్టణ సీఐ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేశామని, రాగానే వారికి అప్పగించనున్నట్లు ఆయన వెల్లడించారు.

వసతి గృహాల్లో లీగల్ సెల్ అథారిటీ తనిఖీ

టేకులసోమారంలోని సాధన మానసిక వికలాంగుల ఆశ్రమంలో తనిఖీ చేస్తున్న మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ఉషాశ్రీ

వలిగొండ, ఫిబ్రవరి21 : మండల కేంద్రంలోని శాంతి నిలయం బాలికల వసతి గృహంతోపాటు టేకులసోమారంలోని సాధన మానసిక వికలాంగుల ఆశ్రమాన్ని మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ఉషాశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బాలికల వసతి గృహంలోని విద్యార్థుల భోజన సదుపాయాలు, శానిటేషన్, వాష్‌రూమ్‌లను పరిశీలించారు. అనంతరం టేకులసోమారంలోని సాధన మానసిక వికలాంగుల ఆశ్రమంలో వికలాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను తెలుసుకొని రికార్డులను పరిశీలించారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు : ఎస్ఐ

మానవ అక్రమ రవాణా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రజనీకర్, పోలీసులు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 21 : బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై, పెట్టిన తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలేరు ఎస్ఐ కె. రజనీకర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మానవ అక్రమ రవాణా పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. బడి ఈడు పిల్లలను వ్యవసాయ, తాపీ, కూలీ పనులకు వెళ్లనివ్వకుండా బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.పిల్లలను పనిలో పెడితే బాలకార్మికుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్ఐ కె. అంజయ్య, హెడ్ కానిస్టేబుల్ దూసరి సత్యనారాయణ గౌడ్, మహిళా కానిస్టేబుల్ మల్లిక, మానవ అక్రమ రవాణా సొసైటీ వలంటీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు అభినందనలు

విజయ సంకేతం చూపుతున్న యాదాద్రి జిల్లా కబడ్డీ జట్టు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 21 : వికారాబాద్‌లో జరుగుతున్న 34వ రాష్ట్ర కబడ్డీ బాలికల క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా జట్టు (46 పాయింట్లు) జగిత్యాల జిల్లా జట్టు (23 పాయింట్లు)పై వియం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ జట్టును ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కబడ్డీ అస